జీఎస్టీ వసూళ్లు ఆల్‌టైమ్ హై

ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, మే 1: జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.2.10 లక్షల కోట్లతో పోలిస్తే 12.6 శాతం అధికమని పేర్కొంది. జీఎస్టీ అమలులోకి వచ్చిన జూలై 1, 2017 తర్వాత ఇదే అత్యధిక వసూళ్లు కావడం విశేషం. ఈ ఏడాది మార్చి నెలలో రూ.1.96 లక్షల కోట్లు వసూలయ్యాయి. గడిచిన నెలలో వసూలైనదాంట్లో దేశీయంగా రూ.1.96 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 10.7 శాతం మేర పెరిగాయి. వీటిలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.48,634 కోట్లు వసూలవగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.59,372 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.69,504 కోట్లు, సెస్ రూపంలో రూ.12,293 కోట్లు వసూలయ్యాయి. దేశ ఆర్థిక రంగం బలంగా ఉందన్నడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శనమని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే పన్ను వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయి దాటిందని డెలాయిట్ ఇండియా పార్టనర్ ఎంఎస్ మణి తెలిపారు. అత్యధిక ఉత్పత్తి, వినిమయ రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లలో వృద్ధి 11 శాతం నుంచి 16 శాతం మధ్యలో నమోదవడం వల్లనే రికార్డు స్థాయికి చేరుకున్నాయన్నారు.

ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

ఏప్రిల్ 2025	రూ.2.37 లక్షల కోట్లు
ఏప్రిల్ 2024	రూ.2.10 లక్షల కోట్లు
మార్చి 2025	రూ.1.96 లక్షల కోట్లు

వాహన విక్రయాలు అంతంతే

న్యూఢిల్లీ, మే 1: మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ గడిచిన నెలలో వాహన విక్రయాలు ఆశించిన స్థాయిలో నమోదయ్యాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలు మారుతి సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయాలు పెరగగా..టాటా మోటర్స్, హ్యుందాయ్ సేల్స్ తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ మహీంద్రా రెండో స్థానానికి, టాటా మోటర్స్ మూడో స్థానానికి ఎగబాకింది. కానీ, రెండో స్థానంలో కొనసాగిన హ్యుందాయ్ ఈసారి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నది. మారుతి అమ్మకాలు ఏడు శాతం అధికమయ్యాయి.

ఏప్రిల్ నెలలో వాహన అమ్మకాలు

సంస్థ	2025	2024	వృద్ధి(శాతంలో)
మారుతి	1,79,791	1,68,089	7
మహీంద్రా	84,170	====	19
టాటా మోటర్స్	72,753	77,521	-6.1
హ్యుందాయ్	60,774	63,701	-5
టయోటా కిర్లోస్కర్	27,324	20,494	33
ఎంజీ మోటర్స్	5,829	4,725	23
కియా ఇండియా	23,623	19,968	18
హోండా కార్స్	3,360	4,351	-23
ద్విచక్ర వాహనాలు			
టీవీఎస్ మోటర్	4,43,896	3,83,615	16
సుజుకీ మోటర్‌సైకిల్	1,12,948	99,377	14
రాయల్ ఎన్‌ఫీల్డ్	86,559	82,043	6

హైదరాబాద్ ఆఫీస్ ఖాళీ

వృథాగా 284 లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు

దేశంలోనే అత్యధికం.. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్

అద్దెకు పెద్దగా ఆసక్తి చూపని కార్పొరేట్లు: వెస్టియన్

ఈ నగరానికి ఏమైంది. అవును.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను చూస్తే ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయిప్పుడు.

ఒకప్పుడు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన ఆఫీస్ స్పేస్.. ఇప్పుడు ఆదరణ లేక కళావిహీనంగా కనిపిస్తున్నది. అద్దెకు తీసుకునేవారే కరువైపోయారు మరి.

గతంలో ఇక్కడ కార్యాలయాలను ఏర్పాటు చేసుకొనేందుకు క్యూ కట్టిన కార్పొరేట్లు.. ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారు. దీంతో లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు ఖాళీగా ఉన్నాయంటూ రియల్ ఎస్టేట్ రిపోర్టులు వస్తున్నాయి.



బీఆర్ఎస్ హయాంలోనే బాగుబాగు

ఉమ్మడి రాష్ట్రంలో నత్తనడకన సాగిన అభివృద్ధి.. విభజన అనంతరం తెలంగాణలో పరుగులు పెట్టింది. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలు అన్ని రంగాలను బలపర్చాయి. ఐటీ, ఫార్మా, ఆటో, ఏవియేషన్, డిఫెన్స్ ఇలా కీలక రంగాలు వృద్ధిపథంలో పయనించాయి. ఇది ఇక్కడి నిర్మాణ రంగానికి ఊహించని స్థాయిలో డిమాండ్‌ను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా ఆఫీస్ స్పేస్‌కు గిరాకీని అమాంతం పెంచేసింది. దేశ, విదేశీ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు భారీగా ముందుకొచ్చాయి. భారత్‌లోకి రావాలంటే హైదరాబాద్‌నే ప్రధాన కేంద్రంగా చేసుకోవాలన్నంతగా డిమాండ్ నెలకొన్నదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి అనేక సంస్థలు హైదరాబాద్‌లో బడాబడా ఆఫీసులను తీసుకొచ్చాయి. మరెన్నో స్టార్టప్‌లూ కొలువుదీరాయి. ఫలితంగా ఆఫీస్ మార్కెట్ వేగంగా విస్తరించింది. దాదాపు పదేండ్ల టీఆర్ఎస్, బీఆర్ఎస్ పాలనలో ఇలాగే సాగిందంతా. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అంతా తలకిందులైంది. ఏడాదిన్నరగా పెట్టుబడులు రాక మార్కెట్‌లో స్తబ్ధత నెలకొన్నది. అందుకు ఆఫీస్ స్పేస్ మార్కెట్ అద్దం పడుతున్నది.

284 లక్షల చదరపు అడుగుల్లో..

దేశంలోని 7 ప్రధాన నగరాల ఆఫీస్ స్పేస్ మార్కెట్‌పై వెస్టియన్ సర్వే చేసింది. దీని వివరాల ప్రకారం హైదరాబాద్‌లోనే గరిష్ఠంగా కార్యాలయ స్థలాలు వృథాగా పడిపోయి ఉన్నట్టు తేలింది. ఏకంగా 284 లక్షల చదరపు అడుగుల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీగా ఉన్నదని వెస్టియన్ ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ ఏడాది మార్చి నాటికి హైదరాబాద్‌లో మొత్తం అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్ 1,620 లక్షల చదరపు అడుగులు. ఇందులో 284 లక్షల చదరపు అడుగులు ఖాళీగానే ఉన్నది. ఇది మొత్తం స్టాక్‌లో 17.5 శాతానికి సమానం. కార్పొరేట్ కంపెనీలు అద్దెకు తీసుకొనేందుకు పెద్దగా ఆసక్తి చూపట్లేదని వెస్టియన్ పేర్కొన్నది. కాగా, గతంలోనూ ఆయా నగరాల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీలుండేవి. అయితే హైదరాబాద్‌లో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపించేది. దాంతో ఆఫీస్ స్పేస్ గిరాకీలో నగరం ఎప్పుడూ టాప్‌లో ఉండేది. మిగతా నగరాలతో పోల్చితే లీజింగ్ పెద్ద ఎత్తున జరిగేది మరి. కానీ మారిన పరిస్థితులతో ఇప్పుడు ఖాళీల్లో టాప్‌లో ఉంటున్నది.

- *దేశంలోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఆఫీస్ స్పేస్ ఖాళీలు. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉన్నాయి.*
- *బెంగళూరు (2,805 లక్షల చదరపు అడుగులు) తర్వాత ఎక్కువగా ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉన్నది హైదరాబాద్ (1,620 లక్షల చదరపు అడుగులు)లోనే.*
- *బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో జోరుగా డిమాండ్-సప్లై. ఇప్పుడు డిమాండ్ లేకపోవడంతో సప్లై కూడా ఆగిపోయింది.*
- *ఈ ఏడాది జనవరి-మార్చిలో దేశీయంగా ఆఫీస్ స్పేస్ లీజింగ్ 34 శాతం పెరిగి 179.6 లక్షల చదరపు అడుగులకు చేరిక.*
- *జీసీసీలు, ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, బ్యాంకింగ్, ఆర్థిక, బీమా రంగాల నుంచి కనిపించిన డిమాండ్.*

దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఖాళీ ఆఫీస్ స్పేస్ నిల్వలు

నగరం	లక్షల చ.అడుగుల్లో
హైదరాబాద్	284
ఢిల్లీ-ఎన్‌సీఆర్	232
బెంగళూరు	210
ముంబై	125
కోల్‌కతా	79
చెన్నై	60
పుణె	56

ఆగిన కొత్త నిర్మాణాలు

ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యి అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ అంతంత మాత్రంగానే ఉండటంతో కొత్త నిర్మాణాలు దాదాపుగా ఆగిపోయాయి. రియల్టర్లు, ఆఫీస్ స్పేస్ నిర్మాణ కంపెనీలు నూతన ప్రాజెక్టులకు దూరంగా ఉంటున్నాయి. ఫలితంగా సిమెంట్, ఉక్కు, ఇతర నిర్మాణ అనుబంధ రంగాలు కుదేలయ్యాయి. వాటిమీద ఆధారపడుతున్న పరిశ్రమలు, వ్యాపారులు, ఉద్యోగులు, కూలీల భవిష్యత్తు ఆందోళనలో పడింది. నిజానికి హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న కార్యాలయ స్థలాలు మునుపు ఇంకా ఎక్కువ (19 శాతం)గానే ఉండేవి. కానీ కొత్త ప్రాజెక్టులు రాకపోవడంతో ఇవి కాస్త తగ్గాయి. కాగా, హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, పుణె నగరాలపై వెస్టియన్ సర్వే చేసింది.

కాగ్నిజెంట్‌లో 20 వేల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, మే 1: అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్..ప్రస్తుతేడాది 20 వేల మంది ప్రెషర్లను నియమించుకోనున్నట్టు ప్రకటించింది. కృత్రిమ మేధస్సుతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై మంచి పట్టున్న ఉద్యోగులను రిక్రూట్ చేసుకోనున్నది. నూతన టెక్నాలజీ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు, గతేడాది రిక్రూట్ చేసుకున్నవారి కంటే రెండింతలు అధికంగా ఈసారి నియమించుకోనున్నట్టు కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ ఎస్ తెలిపారు. ప్రస్తుతం సంస్థలో 3,36,300 మంది ఉద్యోగులు ఉన్నారు.

దిగొస్తున్న బంగారం ధర

హైదరాబాద్‌లో తులం రూ.2,180 డౌన్ • 24 క్యారెట్ రూ.95,730

హైదరాబాద్, మే 1: నిన్నమొన్నటిదాకా ఆకాశమే హద్దుగా పరుగులు పెట్టిన బంగారం ధరలు.. ఇప్పుడు అంతే వేగంగా దిగొస్తున్నాయి. గురువారం ఒక్కరోజే హైదరాబాద్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల రేటు రూ.2,180 తగ్గి రూ.95,730 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం విలువ కూడా రూ.2,000 పడిపోయి రూ.87,750 వద్ద నిలిచింది. నిజానికి గత వారం రోజులుగా గోల్డ్ రేట్లు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. అంతకుముందు తులం రేటు తొలిసారి లక్ష రూపాయల మార్కును దాటిపోయిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు, వివిధ కారణాలతో పతనమైన స్టాక్ మార్కెట్ల వల్ల దేశీయ మార్కెట్‌లో పుత్తడి ధరలు వరుసగా పెరుగుతూపోయాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వస్తున్న బలహీన సంకేతాల నడుమ ధరలు దిగువ ముఖం పడుతున్నాయి.

లోహియా బిస్కెట్ ప్లాంట్

హైదరాబాద్, మే 1: హైదరాబాద్‌కు సమీపంలో మేడ్చల్ వద్ద వరల్డ్ క్లాస్ బిస్కెట్ తయారీ యూనిట్‌ను ప్రారంభించింది లోహియా గ్రూపు. ఏడు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో ప్రస్తుతం నెలకు 1000 టన్నుల బిస్కెట్లు తయారుకానుండగా, వచ్చే నాలుగేండ్లలో ఈ సామర్థ్యాన్ని 5 వేల టన్నులకు పెంచుకోనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వచ్చే నాలుగేండ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది.

హైదరాబాద్‌లో ఆల్ట్.ఎఫ్ కో-వర్కింగ్ ఆఫీస్

హైదరాబాద్, మే 1: కో-వర్కింగ్ నిర్వహణ సంస్థ ఆల్ట్.ఎఫ్..హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని తెరిచింది. 56 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 1,200 మందికి పైగా కూర్చోవడానికి వీలుంటుందని పేర్కొంది. సౌకర్యవంతమైన కార్యాలయాల మార్కెట్ భారీ వృద్ధిని నమోదు చేసుకుంటున్న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని కంపెనీ కో-ఫౌండర్ యోగేశ్ అరోరా తెలిపారు. ఒక్కో డెస్క్ నెలకు రూ.8 వేల చొప్పున చార్జీ వసూలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సంస్థ..ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్‌లలో కో-వర్కింగ్ కార్యాలయాలను నిర్వహిస్తున్నది.

అక్రమ నిర్మాణాలపై కొరడా

- మూడు అంతస్తుల భవనం సీజ్
- అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు
- మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ

భవనం వద్ద నోటీసులు అతికిస్తున్న మున్సిపల్ అధికారులు

ఖానాపూర్, మే 1 : ఖానాపూర్ మున్సిపాలిటీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గురువారం మున్సిపల్ రెండో వార్డులోని శివాజీనగర్ కాలనీలోని కారింగుల గోపాల్, కారింగుల సుమన్‌కు చెందిన భవనం నిర్మాణ దశలో ఉంది. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ చట్టం 2019 ప్రకారం సెక్షన్ 176(8), 181(1) కింద సీజ్ చేశారు. ఇంటిని అనుమతి లేకుండా నిర్మించారని కమిషనర్ కృష్ణ పేర్కొన్నారు. ఇక్కడ రెవెన్యూ ఆర్ఐ నగేశ్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ఏఐ క్యాంపు ప్రారంభం

ఏఐ క్యాంపును ప్రారంభిస్తున్న ఎంఈవో శ్యాంసుందర్

తాంసి(భీంపూర్), మే 1: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి జడ్పీఎస్ఎస్ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) క్యాంపును గురువారం ఎంఈవో శ్యాంసుందర్ ప్రారంభించారు. వేసవిలో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, సురేశ్, రవీందర్ రెడ్డి, విలాస్, శుభం, చిరంజీవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన

కుంటాల, మే 1 : ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి నిర్మల్ జిల్లా కుంటాల మండలం దౌనెల్లి శివారులోని ఓ ప్రాంతంలో గల ప్రభుత్వ భూమిని గురువారం భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి పరిశీలించారు. పీజీబీలీటీ కోసంపై అధికారులకు నివేదికను పంపించినట్లు తెలిపారు. ఆయన వెంట డీటీ నరేశ్ గౌడ్, ఆర్ఐ రాజేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

దౌనెల్లి ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కోమల్ రెడ్డి

అందుబాటులో పత్తి విత్తనాలు

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 1: అందుబాటులో పత్తి విత్తనాలు ఉన్నాయని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. వానకాలానికి సంబంధించిన పత్తి విత్తనాల లభ్యత గురించి కంపెనీల, డిస్ట్రిబ్యూటర్ల వారిగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖకు విత్తనాల లభ్యత గురించి క్రమం తప్పకుండా సమాచారం ఇవ్వాలని సూచించారు. రానున్న వానకాలానికి పత్తి విత్తనాల లభ్యత విరివిగా ఉందని, ఎటువంటి కొరత లేకుండా ముందస్తుగా కంపెనీల నుంచి విత్తన సరఫరా ప్రణాళికను సిద్ధం చేయించి రోజువారి విత్తన లభ్యతను వ్యవసాయ శాఖ ద్వారా ప్రజలకు సమాచారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది తమ మండల పరిధిలో విత్తన డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి రాబోవు వానకాలంలో విత్తన లభ్యత నకిలీ విత్తనాలు అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా మండలంలోని ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో విరివిగా తనిఖీ చేసి ఏదైనా విత్తనాలు బిల్లులు లేకుండా రవాణా చేసినచో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల వారీగా షెడ్యూల్ తయారు చేసి రైతులకు విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన నకిలీ విత్తనాలను గుర్తించడంలో అవగాహణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఈ సంవత్సరం 4,40,000 ఎకరాలలో పత్తి పండించవచ్చని అంచనా వేశారు. ఇందుకు గాను 11,00,000 విత్తన ప్యాకెట్లు వివిధ కంపెనీల హైబ్రిడ్జ్‌లు అవసరం కాగా, కంపెనీలు 21,60,000 ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని ఛబ్రా, ఆర్డీవో వినోద్ కుమార్, డీఎస్పీలు జీవన్ రెడ్డి, శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధరస్వామి, జిల్లాలోని ఏడీఏలు, తహసీల్దార్ వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

నిధులు బార్ కౌన్సిల్‌కు ఉపయోగపడడం లేదు

మాట్లాడుతున్న తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్

ఎదులాపురం, మే 1 : రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి నిధులు కేటాయించిన బార్ కౌన్సిల్‌కు ఉపయోగపడడం లేదని తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌కు వచ్చిన బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశమయ్యారు. ముందుగా ఇక్కడి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాకు వచ్చిన ఆయనకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్ స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు వారి సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కరం కోసం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయించిన వంద కోట్లు బార్ కౌన్సిల్‌కు రాలేదని అన్నారు. ఇప్పటి వరకు ఆయా బార్ అసోసియేషన్లు ఇచ్చిన టికెట్లతోనే నిధులు సమకూర్చి సంక్షేమానికి వినియోగించుకున్నామన్నారు. న్యాయవాదులకు ఆరోగ్య పరంగా ప్రైవేట్‌లో చికిత్సలు చేయించుకోవడానికి రూ.5 లక్షలు నుంచి రూ.10 లక్షల నిధులు కేటాయించాలన్నారు. ఇతర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయవాదుల రక్షణతో పాటు సంక్షేమం కలిగించేల కృషి చేస్తామన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీఎస్పీ శర్మ, ఉపాధ్యక్షుడు చందుసింగ్, కోశాధికారి రణయ్య, అఖిలేశ్, ముజాహిద్ పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత వారోత్సవాలు ప్రారంభం

కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఎదులాపురం, మే 1: విద్యుత్ భద్రత వారోత్సవాలు మే 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చీఫ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్) అండ్ ఆపరేషన్ ఇన్‌చార్జి జేఆర్ చవాన్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని కార్యాలయం ఎదుట భద్రత వారోత్సవాలు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు ప్రతి కార్యాలయంలో వారోత్సవాలు నిర్వహించాలని సూచించారు. విద్యుత్ సిబ్బందికి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు, భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యంగా వారోత్సవాలు నిర్వహించబడుతుందన్నారు. విడుదల చేసిన వారిలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానంద ఆవాసం సందర్శన

భైంసా, మే 1 : నిర్మల్ జిల్లా భైంసాలోని వివేకానంద ఆవాసాన్ని గురువారం సీడబ్ల్యూసీ సభ్యులు, భైంసా న్యాయమూర్తి దేవేంద్ర బాబు సందర్శించారు. వారి యొక్క బాగోగులు, రికార్డులు పరిశీలించారు. ఇక్కడ ఆవాస కమిటీ సభ్యులు శైలేశ్ మాశెట్టి వార్ ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి దేవేంద్ర బాబు

ప్రభుత్వపరంగా చేపట్టే నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా

ఎదులాపురం, మే 1: ప్రభుత్వపరంగా చేపట్టే నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇసుక వెలికితీత, రవాణాపై లైన్ డిపార్ట్‌మెంట్స్ ఇసుక జాయింట్ ఇన్‌స్పెక్షన్‌పై కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. తహసీల్దార్ల పర్యవేక్షణలో సరఫరా ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లతోపాటు ప్రభుత్వపరంగా చేపట్టే నిర్మాణాలకు ఉచితంగా ఇసుక అందించే విధంగా పెన్‌గంగలో ఇసుక లభ్యతపై ఇటీవల సంయుక్త పరిశీలన చేపట్టడం జరిగిందన్నారు. మైనింగ్, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, రెవెన్యూ శాఖల అధికారులు జైనథ్, భీంపూర్, తాంసి, బేల మండలాల్లోని నది పరివాహక ప్రాంతాల్లోని వాల్టా చట్టం అనుసరించి ఇసుక వెలికితీయాలని నిర్ణయించారు. తహసీల్దార్ల పర్యవేక్షణలో సరఫరా ప్రక్రియ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సలోని, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌పీవో అజీజ్‌ఖాన్

సోన్, మే 1: ప్రతి రోజూ ఇంటింటికీ ట్రాక్టర్ ద్వారా చెత్తను సేకరించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని డీఎల్‌పీవో అజీజ్‌ఖాన్ అన్నారు. గురువారం సోన్ గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. నర్సరీలో రెండు పూటల నీటిని మొక్కలకు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, కారోబారి కిషన్‌రావ్ ఉన్నారు.

టీజీహెచ్‌వోఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా సందీప్

ఉట్నూర్, మే 1: తెలంగాణ ఉద్యాన అధికారుల సంఘం(టీజీహెచ్‌వోఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యానవన అధికారి గుడిమళ్ల సందీప్‌కుమార్ ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, కార్యదర్శి సత్యనారాయణ, ఎన్నికల అధికారి శ్రీరాంరెడ్డి, సహాయ ఎన్నికల అధికారి శ్రీనిశ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగగా గెలుపొందారు. కార్యదర్శిగా విద్యాసాగర్(నల్గొండ), సహాయ అధ్యక్షుడిగా అనంత్‌రెడ్డి, కోశాధికారిగా జలంధర్(జీడిమేట్ల), మహిళా అధ్యక్షురాలిగా అనిత(ఖమ్మం)ఎన్నికయ్యారు.

ఇంటి వద్దనే ఇంటర్ విద్యార్థుల అడ్మిషన్లు

ఇంద్రవెల్లి, మే 1 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గురువారం మండలంలోని లింగూడ, భీంనగర్, గోండ్‌గూడ, మిలిండ్‌నగర్‌లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇంటికి వెళ్లి ఉచిత అడ్మిషన్లపై విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు తీసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్, మాదసు మధుకర్, పూర్ణ చంద్రశేఖర్ పాల్గొన్నారు.